# తరం తరం అంతరం

## వలివేటి నాగచంద్రావతి

ఎవరివో పెద్దగా మాటలూ, ఆ వెంటనే సంభ్రమంగా ఆహ్వానిస్తున్న అత్తగారి కంఠస్వరమూ వినిపించి అప్పుడే మెలకువ వచ్చిన నందినికి నిద్రమత్తు వదిలిపోయింది.

మళ్ళీ ఎవరో దిగబడ్డారు. దీర్ఘంగా నిట్టూర్చి కళ్ళు విప్పింది. పక్క మంచంమీద భర్త భానుమూర్తి సన్నగా గురకతీస్తూ నిద్రపోతున్నాడు.

లేచి కింద చాపలమీద పక్క బట్టలన్నీ ఓ పక్కకి తన్నేసి అస్తవ్యస్తంగా పడుకున్న పిల్లల్ని సరిగ్గా పడుకోబెట్టి గది దాటి ఇవతలకు వచ్చింది.

వంటింటి ముందున్న వెల్లాలోనే ఎదురొచ్చింది అత్తగారు వర్ధనమ్మ ఆవిడ మొహం సూర్యుణ్ణి చూసిన పొద్దుతిరుగుడు పువ్వులా విప్పారి ఉంది.

"నందూ సావిత్రి వచ్చిందే పెద్దత్తగారి మనవరాలి పెళ్ళిట చూసి తిరిగి వెళ్తూ మనల్ని చూడాలనిపించి దిగిందట."

"ఆహా..." ముభావంగా అనేసి పెరట్లోకి నడిచింది నందిని.

నూతి పళ్ళెంమీద పిల్లలకి మొహాలు కడిగిస్తోంది సావిత్రి. నందినిని చూసి పలకరింపుగా నవ్వింది.

"ఏమమ్మా మరదలా ఇప్పుడా లేవటం? నీకు మా పిన్ని గారాం మరీ ఎక్కువైంది సుమా, లేకపోతే ఆడబడుచు వచ్చి పడింది. చాకిరీ చెయ్యాలిసొస్తుందని ముసుగు బిడాయించి నిద్ర నటించావా?" అని మేలమాడింది.

నందిని నొసలు కనీ కనిపించకుండా చిట్లాయి. "నా ఇష్టాయిష్టాలతో నీకు లెక్కేమి టొదినా, నేను చెయ్యకపోతే చేసుకునన్నా తిని పోతావు కానీ, రాక మానవు కదా!" అన్నది.

సావిత్రి మొహం క్షణం వెల వెలపోయింది. దెబ్బతిన్నట్టుగా చూసింది.

పెరట్లో పేర్చి ఉన్న కట్టెల కోసం అప్పుడే వచ్చిన వర్ధనమ్మ కోడలి మాటలు విని తెల్లబోయింది. ఆ దెబ్బ తనకే తాకినట్టుగా విల విలలాడింది.

"అవేమి మాటలే నందీ?" అన్నది కినుకగా.

చటుక్కున సరిదిద్దుకుని మొహం ప్రసన్నం చేసుకుంది నందిని. "నే నేమన్నా నత్తా నాకంటే తనకే ఈ ఇంట్లో ఎక్కువ స్వాతంత్ర మున్నదన్నాను. తప్పా?" అన్నది.

మలినమైన వర్ధనమ్మ మొహం ఈ మాటతో తిరిగి తేటపడింది.

"నీ మొహం ఆ మాట అలాగా చెప్పడం, విన్నవాళ్ళకి అదీ ఏ అర్ధంతో స్ఫురిస్తుందో తెలుసునా?" అన్నది ఆప్యాయంగా కోప్పడుతూ.

"ఏమో అన్ని అర్ధాలు నాకు తెలీవు నే నన్నది ఒకే అర్ధంతో." బ్రష్షూ, పేస్టూ తీసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది నందిని.

తిరిగి నందిని వెల్లా ముందుకు వచ్చేవేళకు వంటింట్లో వర్ధనమ్మ కాఫీ కుంపటి దగ్గర ఉంది చుట్టూరా సావిత్రీ పిల్లలతో సహా.

సావిత్రి ఏమన్నదో గానీ వర్ధనమ్మ సమాధాన పెడుతోంది. "అబ్బే పిచ్చిబొంద, అలా పెళుసుగా కనిపిస్తుందే కానీ కడుపులో కల్మషం లేదే దానికి నువ్వా మాట లేవి పట్టించుకోమాకు" అని.

ప్చ్...తను తెలియచెప్పా లనుకున్న ప్రతిసారీ అత్తగారిలాగే తేల్చేస్తుంటుంది. ఆవిడ మొహం చూసి చేసుకున్న నిర్ణయాన్ని ఎప్పటికప్పుడు అర్ధాంతరంగా ముగించెయ్యాలిసొస్తుంటుంది తనకి.

నందిని నిట్టూరుస్తూ గదిలోకి వెళ్ళిపోయింది.

పిల్లల్ని లేపి పక్కలు మడస్తోన్న నందినికి అత్తగారు పాలేరుకి పురమాయిస్తున్న పనులు వినబడుతున్నాయి.

"ఒరే గోవిందూ, పాలు పిండేటప్పుడు చెంబులో గానీ నీళ్ళచుక్క లుంచేవ్ కావా పట్టాలి...చూడూ....మధ్యాహ్నం వచ్చినప్పుడు పడమటివేపు కొబ్బరిచెట్టు గెల దింపు. మరిచిపోకుసుమా. అన్నట్టు ముందు బజారువేపెళ్ళి ముప్పావుంకాయలూ, బంగాళాదుంపలూ పట్రా" అంటూ.

సావిత్రి ఉన్నన్నినాళ్ళూ వర్ధనమ్మ హడావిడికి అంతుండదు.

సావిత్రే అనేవిటి బంధువు లెవరొచ్చినా ఆ వచ్చినవాళ్ళు దగ్గరివారా, దూరపువారా అన్న భేదం లేకుండా ఆడపడుచు తోడికోడలి మేనత్త మనవడి తోడల్లుడి నయినా "అయ్యో, నాకు కొడుకు వరసేగా" అంటుంది. రెండు చేతులా ఆహ్వానిస్తుంది.

వాళ్ళకి పూట పూటా పిండివంటలతో భోజన మమర్చి వాళ్ళు కూర్చున్నా నుంచున్నా రాచమర్యాదలతో ఉక్కిరిబిక్కిరి చేసి వర్ధనమ్మగారి ఆతిథ్యానికి వాళ్ళు మరీ మరీ తహతహలాడాలనీ, మళ్ళీ మళ్ళీ వచ్చి

పోవాలనీ గాఢంగా కోరుకుంటుంది.


గృహమంటే ఎప్పుడూ అతిథి అభ్యాగతులతో కలకలలాడిపోవాలనీ, అన్నపూర్ణలా ఎల్లప్పుడూ వండి వారుస్తూ అందరినీ ఆదరించి తృప్తిపరిచి పంపితేనే గృహిణి జన్మ సార్థకమవుతుందనీ ఆవిడ నమ్మకం.

ఇక సావిత్రి అంటే ప్రత్యేకమైన అభిమాన మావిడకి సావిత్రి వర్ధనమ్మ బావగారి కూతురు కాన్పులో తోడికోడలు మరణిస్తే పురుట్లో గుడ్డు నెత్తి పెంచింది వర్ధనమ్మ ఆ తరవాత తనకీ కూతుళ్ళు పుట్టుకొచ్చినా 'నా పెద్ద కూతురు' సావిత్రే అనేది కట్నాలూ, కానుకలు ఉమ్మడి సంసారంలోనే జరిపినా పెళ్ళి పెత్తనమంతా తలమీద వేసుకుని కాళ్ళు కడిగి కన్యాదానం చేసింది వర్ధనమ్మ దంపతులే. పండగొచ్చినా, పబ్బమొచ్చినా, పురుడైనా, పుణ్యమైనా సావిత్రికి పుట్టింట తీరవలసిన ముచ్చట్లన్నీ వర్ధనమ్మ ఇంట్లో ఆవిడ చేతులమీదుగానే తీరేయి. ఇప్పటికీ స్వంత కూతురికీ, బావ కూతురికీ తేడా తెలియకుండానే జరుపుకొస్తోంది వర్ధనమ్మ.

సావిత్రి ఈసారి వారం రోజులుంది.

వర్ధనమ్మ ఎప్పటిలానే సావిత్రి మనసుపడ్డవీ, ఇష్టమైనవీ వండి కొసరి కొసరి తినిపించింది "పట్నవాసం తిండి పసలేక అరకాగిపోయారు పిల్లలు" అంటూ పాలు, పెరుగు, వెన్న, మీగడలతో వాళ్ళని ముంచెత్తి లేపిందా నాలుగు రోజులూ.

వెళ్ళేముందర కోవా బిళ్ళలూ, వెన్న



ఉండలూ తీసుకెళ్ళటం కోసం భారీ ఎత్తున చేసిపెట్టింది పొలంలో పండాయంటూ కందులూ, మినుములూ, వేరుశనగలూ మూటలు కట్టింది. అటుకులకు వడ్లు నానబోసింది.

ఇవన్నీ సాక్షీమాత్రంగా చూనర్తూ ఊరుకుంది నందిని.

సావిత్రి రేపు వెడుతుందనగా భానుమూర్తిని పిలిచి అన్నది వర్ధనమ్మ..."ఒరే భానూ, సావిత్రి రేపు వెడతానంటోందిరా" అని.

"మరి నాలుగు రోజు లుండమనకపోయేవా?" అన్నాడు భానుమూర్తి.

"పిల్లల స్కూళ్ళు పోతాయిట. మరిక అదాగదు. నువ్వు సాయంత్రం అలా కామరాజుగారి కొట్టుకి వెళ్ళి దాని కోచీరా, పిల్లకాయలకి గుడ్డలూ పట్టుకువచ్చేయి" అంది వర్ధనమ్మ.

"సరేలే" అన్నాడు భానుమూర్తి.

సాయంత్రం అతను బయటకు వెడుతోంటే లోపలికి పిలిచింది నందిని భానుమూర్తి గదిలోకి వచ్చాడు.

"ఎక్కడికీ వెడుతున్నారు?"

"అలా బజారుకి."

"ఎందుకు?"

"ఎందుకేవిటి? ఇందాక అమ్మ చెప్పింది వినలా...సావిత్రక్కకి బట్టలు తెమ్మనటం?"

"విన్నాను అవునూ ... ఎన్నేళ్ళొచ్చినా అమ్మ చెప్పిందానికి డూడూ బసవన్నలా తలూపటం తప్ప సొంత ఆలోచనా, సొంత నిర్ణయమూ ఉండవా మీకు?" చురుగ్గా చూసింది.

"అబ్బ చెప్పాలనుకున్న దేదో తిన్నగా చెబుదూ". భానుమూర్తి కసురుకున్నాడు.

సంపాయించింది ఇంట్లో పడేసి, పెట్టింది తిని, చెప్పింది చెయ్యటం. మిగతా బాధ్యతలు ఇంట్లో వాళ్లమీద వదిలి నిష్పూచీగా ఉండటం భానుమూర్తి తరహా.

"మీ సావిత్రక్క వచ్చి వెళ్ళి ఇప్పటి కింకా నిండా ఆర్నెల్లవలేదు. ఇది రెండోసారి. ఆవిడిలా ఏడాదికి రెండుసార్లు పిల్లల్నేసుకు వచ్చేస్తుంటుంది. వచ్చి వెళ్ళినప్పుడల్లా పప్పులూ, ఉప్పులూ కట్టి ఇచ్చింది చాలక మీ అమ్మ మళ్ళీ చీరా, సారే కూడా అంటుంది. సరే మీరు మాతృవాక్య పరిపాలకులు ఎందుకూ అని కూడా అడగరు. మన పెళ్ళయిన పదహారేళ్ళ బట్టీ చూస్తున్నాను ఈ తంతు ఇది ఇంక ఎన్నాళ్ళు సాగనివ్వాలో చెప్పండి!"

తెల్లబోయి చూశాడు భానుమూర్తి భార్య మనసున బంధువుల రాక పట్ల విముఖత ఉన్నట్టుగా చూచాయగా తెలుసు గానీ అది ఇలాగున...అందులో సావిత్రి వచ్చినప్పుడు బట్టబయలు చేస్తుందనుకోలేదతను.

క్షణం తరువాత తేరుకుని "సావిత్రక్కని ఈ ఇంటికి పెద్దాబడుచుగా భావిస్తుంది అమ్మ ఆవిడ మాట నెలా కాదనటం?" అన్నాడు నానుస్తూ.

బట్టలకొట్లో పాత అప్పు తీర్చకుండానే తిరిగి పద్దు రాయించవలసి వస్తోన్న సంగతి గమనానికి వచ్చిందా సమయాన అతనికి.

"మీ అమ్మ పెద్దది. పూర్వోత్తరం మనిషి బావ కూతుర్ని కూడా స్వంత కూతురనుకోగల సత్తెకాలం మనిషి. ఆవిడకి చేతులెత్తి మొక్కాలి. కాదనను కానీ ఆవిడతో పాటు మనమూ మారిన కాలాన్ని మరిచిపోతే ఎలా?"

"మీ నాన్నగారి హయాంలో ఏభై ఎకరాల ఆసాములు మీరు. ఇప్పుడెంత ఉంది? పది ఎకరాలు ఇంకా మీ అమ్మలాగే పెత్తండ్రి కూతుళ్ళకీ ఆడబడుచులతో సాటిగా పెట్టుపోతలు జరుపుతూ, ఇంటికి వచ్చిన ప్రతి ఆ చంట పాచంట వాళ్ళందర్నీ నా వాళ్ళే అంటూ మేపుకుంటూపోతే ఆసాముల మనుకుంటున్న వాళ్ళం కౌలుదార్ల మవ్వటానికి అట్టే కాలం పట్టదు."

"నువ్వు మరీ అన్యాయంగా మాట్లాడుతున్నావ్ నందూ. చుట్టపక్కాల నెవర్నీ గుమ్మం తొక్కద్దని కట్టడి చెయ్యాలి నువ్వు చెప్పేలెక్కన అంతేనా."

"బంధువుల నందర్నీ చెలనాడుకొమ్మన్నానా నేను? వాళ్ళు రానూ వచ్చు ఒక పూటా, రోజూ ఉండి వాళ్ళ పని ముగించుకు వెళ్ళవచ్చు కానీ మనింటి పద్ధతి ఏమిటి? ఆ వచ్చినవాకి వియ్యాలవారి మనుగుడుపుల్లా అడుగులకి మడుగు లొత్తటం, వెళతానంటే పట్టి బలవంతానా రోజుల తరబడి ఉంచెయ్యడం, వెళ్ళేటప్పుడు కానుకలతో సంచులు నింపి మరీ వీడ్కోలివ్వటం ఈ ధారాళాన్ని కాస్త అదుపు చెయ్యమంటున్నాను అంతే."

"నాకు నేర్పాలిసిన పాఠాలు వాడి కెందుకే చెబుతున్నావు నందనీ!"

ఎప్పుడు వచ్చిందో గడపలో ఉంది వర్ధనమ్మ ఆవిడ కంఠంలో నిష్ఠురంతో పాటు నిందా, వ్యధా కూడా కలిసి ఉన్నాయి.

ఆ క్షణం గతుక్కుమన్నా వెంటనే నిలదొక్కుకున్నది నందిని. "నీకు కూడా చెప్పాలనే నా ప్రయత్నం అత్తా." నెమ్మదిగా చెప్పినా దృఢంగానే అన్నది నందిని.

"నువ్వీ ఇంటికి యజమానురాలివి. మోసేవారికే బరువూ, బాధ్యతా తెలుస్తాయి. నువ్వు చెప్పినట్టు నడవటమే మా ధర్మం. కానీ నువ్వు చెప్పింది సరిగ్గా అర్థమవక అడుగుతున్నానూ...అతిథులకు అతిథ్య

మివ్వటంలో ఏవో కొలతలూ, గట్రా ఇచ్చావ్ బాగనే ఉంది. ఈ ఇంటి ఆడబడుచులున్నారు వాళ్లకూ ఈ నియమనింబంధనలే వర్తిస్తాయా అని అడుగుతున్నారు...అహ..ఇంకో గుమ్మం మెట్టి వాళ్ళూ మనకి పరాయివాళ్ళయినారు కదా వాళ్ళూ ఒక్క పూటా రోజూ ముచ్చటగా ఉండి వట్టి చేతులతో వెళ్ళాల్సిన వాళ్ళే నంటావా అని."

"ఎంత మాటన్నా వత్తా!" నొచ్చుకుంటూ అన్నది నందిని. "నీ ఇల్లు అయింతరవాతే ఇది నా ఇల్లయింది సుజనా, సుప్రియా ఈ ఇంట్లో నీ కడుపున పుట్టినవాళ్ళు, వాళ్ళు పరాయి వాళ్ళెలా అవుతారు! వాళ్ళే ఇంటికి వెళ్ళినా ఈ ఇంట్లో స్థానం వాళ్లకి స్థిరంగా ఉంటుంది. వాళ్ళ తరవాతే నా బిడ్డలైనా."

తన కూతుళ్ళతో సావిత్రిని కూడా కలుపుకునే ఆడబడచులని అన్నది వర్ధనమ్మ కాదు..సుజనా, సుప్రియా మాత్రమే తన ఆడబడుచులని మెత్తమెత్తగానే అయినా కచ్చితంగా అత్తగారికి తేల్చిచెప్పేసింది నందిని.

"నిజ మెప్పుడు కఠినంగానే ఉంటుందత్తా. నీ కాలంలోలా అసలు వారితో సమానంగా కొసరు వారికి కావిళ్ళు మోసి నిభాయించుకునే కాలం కాదిది. మంది ఎక్కువయితే మజ్జిగ పలచన సుజనకీ, సుప్రియకీ కాస్త మంచి చీర పెడదామంటే కుదరటంలేదు. ఈ రోజు సావిత్రి వదినగారికి బొట్టుపెట్టి పంపగలిగితే రెపు సుజనా,, సుప్రియా వచ్చినప్పుడు మామూలు వాయిల్ చీరకి బదులు సిల్కుచీర పెట్టగలుగుతాం. అదీ నే ననేది."

"నువ్వేమనుకున్నాసరే. నాది స్వార్థమే నాకు నా వాళ్ళ తరవాతే ఎవరైనా. నా వారైన మీకు ఏ లోటూ రానివ్వకూడదంచె పైవారి మీద ఆంక్షలు విధించటం తప్పనిసరి. న న్నర్థం చేసుకో." ప్రాధేయపూర్వకంగా నచ్చచెబుతూ అన్నది నందిని.

'నీ నిర్ణయం అనుచితంగా ఉంది.' అని చెప్పలేకపోయిన వర్ధనమ్మ విషణ్ణవదనంతో కదిలిపోయిం దక్కణ్ణించి.

ఆర్థికలోపం రీత్యా భార్య విధానం నమ్మతంగానే ఉన్నా మనసులో ఏదో కొరతగానే ఉంది భానుమూర్తికి కూడా.

మనస్ఫూర్తిగా తల్లివాదన నచ్చింది కుసుమ కొక్కదానికే. పద్నాలుగేళ్ళ కుసుమ ఆరిన బట్టలు మడుస్తూ ఆ గదిలోనే ఉండి వారి సంభాషణలు మొత్తం విన్నది. అప్పుడే వ్యక్తత వస్తున్న ఆపిల్లకి ఇంట్లో పరిస్థితి అవగాహన అవుతోంది.

నాయనమ్మ బంధుప్రీతి ఆ పిల్లకి ఎరుకే. బుట్టల కొద్దీ గారెలూ, బూరెలూ వండినా ఇంట్లో వాళ్ళ వంతు కొచ్చేసరికి ఒకటీ అరా మిగలటం, చుట్టాలకి మాత్రం కొసరి కొసరి వెక్కనవ్వై పారేసేంతగా వడ్డించటం, ఇదేమంటే, "నోరు ముయ్యండే పిల్లకుంకలు మీకేం తెలుసు?" అంటూ నోరు నొక్కటం ఈ పద్ధతి మూలంగా నాయనమ్మ అంటే అంత సుముఖత లేదా అమ్మాయికి. "అయినవాళ్ళకి ఆకుల్లో, కానివాళ్ళకి కంచాల్లో పెదుతుందీవిడ" అనుకుంటుంది.

అంతేకాకుండా ఈ చుట్టాలమూలంగా ఇల్లెప్పుడూ గందరగోళంగా ఉంటం, ఆ ఖర్చుమూలంగా తామే చిన్న కోరిక కోరినా తల్లీ, తండ్రీ తోసిపుచ్చుతుండటంతో ఆ అసంతృప్తి మరింత పెరిగింది.

"ఇన్నాళ్లకి బామ్మ ఆటకట్టు" అనుకుంది కుసుమ ఆనందంగా.

● ● ● ● ●

పద్నాలుగేళ్ళ కుసుమ కిప్పుడు ఆ వయసు సంఖ్య తిరగబడి నలభై ఒకటి వచ్చేయి.

భర్త భార్గవ గెజిటెడ్ ఆఫీసరు. కొడుకు చైతన్య పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్నాడు. కూతురు డిగ్రీ చదువుతోంది.

చక్కటి చిన్న సంసారం ముచ్చటయిన స్వంత ఇల్లు, కారు, బాంక్ బాలెన్స్...మూడు పూలూ ఆరు కాయలుగా ఉందామె పని.

ఆవేళ మావగారి దగ్గర్నించి వచ్చిన ఉత్తరం చదువుతూ ఆలోచనలో పడింది కుసుమ.

ఆఖరి మరిది శివుడికి మెడికల్ ఎంట్రెన్స్‌లో రాంక్ వచ్చిందిట... "నువ్వు సాయంచేస్తానంటే మెడిసిన్‌లో జాయిన్ చేస్తాను వాణ్ణి" అని కొడుక్కి రాశాడాయన. ఇంకా తన కష్టాలూ, బాధలూ చాలా వెళ్ళబోశాడాయన.

అందుకు కాదు ఆమె ఆలోచనలో పడడం. "కుసుమకీ ఉత్తరం చూపించొద్దు. ఆఫీసులోనే ఆలోచించి ఓ నిర్ణయానికిరా. ఇలా రాస్తున్న కారణం నీకూ తెలుసు కన్నందుకు ఎవరి పిల్లల బాధ్యత వారే వహించాలి. ఇతరుల మీద.... వాళ్ళు స్వంత కొడుకులైనా సరే మోపడం అన్యాయ మంటుంది నీ భార్య.

అది ఈ తరం నీతి కాబోలునేమో కానీ నేను వెనకటివాణ్ణే. ఎదిగిన కొడుకుమీద ఆశ పెట్టుకొకుండా ఉండలేకపోతున్నాను. మూడేళ్ళయింది. వాణ్ణి చదివించలేక మానిపించి ఇంట్లో కూర్చోపెట్టాను నువ్వు కాదంటే వాడి కర్మ మింతే ననుకుంటాను. అవునంటే వాడి రాత మారిందనుకుంటాను.ఏం చేస్తావో... నీ నిర్ణయంమీద వాడి భవిష్యత్తు ఆధారపడి ఉంది." ఇవీ ఆయన చివరికి రాసిన వాక్యాలు.

అదిగో అలా మీదికి నెట్టి చేతులు దులుపుకునే తత్వమే నచ్చదు కుసుమకి అసలా ఉత్తరం ఆమెకి అందవలసింది కాదు. భార్గవ ఊళ్ళో లేకపోవటంవల్ల ఆఫీసు ఎడ్రసుకు వచ్చిన ఆ ఉత్తరాన్ని ప్యూను ఇంటికి తీసుకువచ్చి ఇచ్చిపోయాడు.

మావగారు తనమీద మోపిన అభియోగం గురించే ఆలోచిస్తోంది కుసుమ. ఎంత యోచించినా తన అభిప్రాయం గానీ, తా నవలంబించిన పంథా గానీ అనుచిత మనిపించటంలేదు.

చూసిందిగా తన తండ్రి నిర్వాకాన్ని ఎంత ఆస్థి ఉండేది మొదట్లో తోటలు, దొడ్లు, భూములు, దీవాణం లాంటి ఇల్లు పిల్లజమిందారీలా ఉండేది. తన పెళ్లినాటికే అదంతా మాంత్రికుడు హుష్ కాకీ అంటే మాయమైనట్లుగా అయిపోయింది.

ఏమయిం దదంతా? "ఇంటికి పెద్ద కొడుకువి మిగిలిన వాళ్ళని ఉద్ధరించే భారం నీదే ఇంటి పరువూ ప్రతిష్ఠా పదిమందీ మెచ్చేలా నిలబెట్టే బాధ్యత నీదే." అంటూ వెనకాల బామ్మ ఎక్కేస్తుంటే ఛాతీ ఉప్పొంగించుకుని, అట్టహాసంగా చెల్లెళ్ళకీ, తమ్ముళ్లకీ పెళ్ళిళ్ళు చేసి ఆడంబరంగా పెట్టుపోతలు జరిపి చీమ చిటుక్కుమంటే వాళ్ళకి బానట అయి నిలిచి తల్లికి తీర్థయాత్రలూ, నోములూ, వ్రతాలూ గట్రా అంటే ఆ కోరికలన్నీ తీర్చి, చివరకీ సొంత పిల్లల వంతు వచ్చేసరికి చేతులెత్తేశాడు.

ఇంకా పై బంధువలు తాకిడికి తల్లి అడ్డం పడబట్టి కానీ ఇంకా అధ్వాన్నమయ్యేది పరిస్థితి.

పుట్టింటి అనుభవం తన కో మరిచిపోలేని గుణపాఠం నేర్పింది. అందుచేత తను ముందే మేలుకుంది. అదే ఈ రోజు మావగారు తనమీద అగ్రహపడుతూ నింద వేయ్యటానికి కారణమైంది.

'పాపం, తేరతిండి దక్కనిచ్చేను కాదన్న దుగ్ధ ఇన్నేళ్ళయినా పోలే దీ మహానుభావుడికి హు ! నేను గనక వ్యతిరేకించకపోయుంచె కొడుకని కూడా జాలి తలచకుండా రక్తం మాంసం కూడా నంజుకుతినే పేరసైట్లు వీళ్ళు' కసిగా అనుకుంది కుసుమ.

కుసుమ పెళ్ళి నాటికి భార్గవ ఒక చిన్న గుమాస్తా మాత్రమే. తండ్రి అంతకంటే పెద్ద సంబంధం తేలేకపోయాడామెకి. అత్తవారిల్లు పుట్టింటి పరిస్థితికే మాత్రమూ తీసిపోయేట్టుగా లేదు. ముగ్గురు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్లూ, ఇంకా కని పెంచుతున్న తల్లీ, హాయిగా చీకూ చింతా లేకుండా చుట్ట పీలుస్తూ వీధి అరుగుమీద నలుగుర్నీ చేర్చి లోకాభిరామాయణంతో కాలక్షేపం చేసే తండ్రీ ఇంతమందికీ ఆమె భర్త రెక్కలే ఆధారం.

పోనిమ్మంటే, అతని సంపాదన తినటమే కానీ అతని అభివృద్ధిని కోరే లక్షణాలైనా లేవు వాళ్ళకి.

భార్గవ ప్రస్తుతం చిన్న ఉద్యోగంలోనే ఉన్నా ప్రమోషన్ అవకాశాలు చాలా ఉన్నాయి. కానీ ఎంతసేపూ "కామారాజుగారి కొట్లో ఓ గంట పద్దులు రాస్తే వందస్తారట. సాయంత్రం ఆఫీసునించొచ్చాక అట్లా వెళ్ళి ఆ పని చూడరాదట్రా, తమ్ముళ్ళ ఫీజుల కయినా వస్తాయి." అనో, "ఉదయంపూట అలా మంచాన్ని కరుచుకోకపోతే నలుగురు పిల్లలకి ప్రైవేట్లయినా చెప్పరాదట్రా ఆడపిల్లల బట్టల కయినా వస్తాయి." అనో, అతని ఆఫీసు గంటలు మినహాయించగా మిగిలిన కొద్ది కాలాన్నీ మింగేయటం తప్ప అతన్ని ఆ ప్రమోషన్ టెస్టులకి చదవమని ప్రోత్సహించినవారు లేరు.

మొదట భార్గవని ఆ టెస్టులకి ప్రయత్నం చేయమందా మనుకున్నది కుసుమ కానీ ఆ ఇల్లో కిష్కింధ చిల్లో బొల్లో అంటూ పిల్లల కాకిగోల. గడియ కొకటిగా ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు, అడ్డంకులు ఉత్సాహంమీద నీళ్ళు చల్లే పెద్దలు ఆ వాతావరణంలో చదువనేది ఎలాంటి వారికైనా ఏం వంటపడుతుంది? అందుకని ఈ బలగాన్నంతా ఇంట్లోంచి పంపించెయ్యటాన్నే తొలిమెట్టుగా పెట్టుకుంది కుసుమ.

వారి స్వంత ఊరొక పల్లె. అక్కడ వారి కో చిన్న ఇల్లూ, చేరెడు చెక్కా ఉన్నాయి. వాళ్ళ నా పల్లెకు తరలించేసరికి తల్లో ప్రాణం కాలి వేళ్ళ చివరకి చేరుకుంది కుసుమకి.

ఎన్ని నిష్ఠురాలు, కోపాలు, అలకలు! ఏడుపులు మొత్తుకోళ్ళు! దేన్నీ పట్టించుకోలేదు. చివరికి ఉక్రోషంకొద్దీ 'మా కోడలు రాక్షసి' అని ప్రచారం చేసినా లెక్కచెయ్యలేదు.

"లోకంలో ఇంతో అంతో కూడపెట్టి పిల్లల కావ్వాలనుకునేవాళ్ళని చూశాను గానీ, ఇలా కొడుకు కష్టమ్మీద పొట్ట నింపుకునేవాళ్ళని మిమ్మల్నే చూశాను. ఆస్తు లివ్వటం మాట అలా ఉంచండి పెంచి ప్రయోజకుల్ని చేసే స్తోమత లేకపోయినా ఎడాపెడా కనిపారేశారు. వాళ్ళకి మేము పూచీ పడాలా? ఇదేం న్యాయం? ఇట్లా పోయిన పొడుగూతా మాజీతం, జీవితం మీ కర్పించేసి కొసకి మీరు చూపిన దారి వెంటే మా పిల్లల మీదే మేమూ ఆధారపడమా? ఊహూ...నే నా పొరపాటు పని చేయదలుచుకోలేదు. మీ దారి మీరు చూసుకోండి" అన్న తన అభిప్రాయాన్ని నిష్కర్షగా చెప్పేసి సాగనంపేసింది వాళ్ళను.

ముందు భార్గవ కొద్దిగా తప్పు

చేసినట్టుగా ఫీలయినా తరవాత్తరవాత అంచెలంచెలుగా పైకెదిగి వచ్చి, డబ్బు సంపాదనా, దాంతో పాటు హోదా పెరిగి, నలుగురిలోనూ గుర్తింపుకొస్తున్న కొద్దీ 'నన్ను కన్నవాళ్ళు, నా రక్తసంబంధీకులూ అనుకొంటూ ఆ సెంటిమెంట్లనుంచి బయటపడలేక తన వాళ్ళ నలా వదిలించుకోకపోయుంటే ఈ ఎదుగుదల ఉండేది కాదన్న నిర్ధారణకు వచ్చాక ఆ అపరాధభావనా, ఆత్మన్యూనతాభావం మెల్ల మెల్లగా వాడంతట అవే తొలగిపోయాయి.

తన అభ్యున్నతికి ఓ బాట వేసి ఆ బాటని తన ధీరత్వంతో నిష్కంటకం చేసి, తను ఒక్కొక్క మెట్టే పై కెక్కేందుకు ప్రోత్సహించి ఉత్సాహపరచిన కుసుమ అంటే వల్లమాలిన అభిమానం కలిగింది. భార్య అనుసరించిన విధానమే సరియైనది అన్న నిర్ణయానికి ఎప్పుడో వచ్చేశా డాయన.

తల్లి చురుకుతనం, తమకోసం, తమ కుటుంబం అభివృద్ధికోసం, తమ ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ పనిలో ఎలాంటి అవరోధా లేర్పడినా ఎదుర్కొని విజయవంతంగా ఆ కార్యం నిర్వహించే తల్లి సమర్థత మీదా కుసుమ పిల్లలకి గూడా గొప్ప విశ్వాసం, గౌరవం.

● ● ● ● ●

మర్నాడు ఊరి నుంచి వచ్చిన భార్గవకు ఉత్తరం అందించింది కుసుమ మౌనంగా వంటనే చదువుకున్నా భార్గవ కూడా దాని గురించి అప్పటికేమీ అనలేదు.

మరో రెండు రోజుల వరకూ కూడా అతనా ప్రస్తావనే ఎత్తకపోయేసరికి తండ్రి రాసినట్టుగా తన ప్రమేయం లేకుండా స్వయం నిర్ణయం చేసుకున్నాడా అన్న అనుమానం ఊహామాత్రంగా సోకింది కుసుమకి. కానీ ఆ భయం ఆధారం లేనిదని ఆ రోజే తేలిపోయింది.

"నాన్నకి జవాబు రాయాలి" అన్నాడు భార్గవ ఆ రోజు రాత్రి భోజనా లయ్యాక టీ.వీ. చూనన్తూ తాంబూలం ఇన్తున్న భార్యతో.

"రాయండి" అన్నది కుసుమ పట్టనట్టుగా

"అదే ఏమి రాయటమా అని."

నవ్వింది కుసుమ "బావుంది ఆయన నా కసలు చెప్పొద్దంటే మీరు నా సలహా అడుగుతున్నారా?" అన్నది.

'ఆయన మాటలే వినుంటే ఈ రోజు నేనే ఇంకొకళ్ళ ముందు చేయిజాపే స్థితిలో ఉండేవాణ్ణి' అని లోపలే అనుకుంటూ, "ఆయన మాట కేమిలే నువ్వు చెప్పు ఏం రాద్దామంటావ్?" అన్నాడు భార్గవ.

"ముందు మీ రే మనుకుంటున్నారో చెప్పండి" అంది కుసుమ భర్త మనసుని అంచనా వేస్తూ.

భార్గవ ఒక్క క్షణం తటపటాయిస్తున్నట్టు ఆగాడు. "అదే ఆలోచిస్తున్నాను కుసుమా, లక్ష్మి పెళ్ళికీ, సావిత్రి పెళ్ళికీ కూడా అడిగినా మన మేమీ ఇవ్వలేకపోయాము. ఇల్లు కన్‌స్ట్రక్షన్‌లో ఉండటం వల్ల ఒకసారీ, కారు కొనాలన్న సందట్లో ఒకసారీ ఉండిపోయాం. ఆ తరవాత సారథి వ్యవసాయం పనుల కేవేవో కొనాలంటేనూ ఏవో ఇబ్బందుల్లో ఉండి పొమ్ము సర్దలేకపోయాం. రాముణ్ణి శానిటోరియంలో చేర్చాలని అడిగానప్పుడూ వట్టి చెయ్యే చూపించాం అప్పటి మన పరిస్థితి అట్లాంటిది.

"ఇప్పుడు మనకి అలాంటి వత్తిళ్ళేమీ లేవు కదా. శివుడికి కాస్త సాయం చేస్తే ఏం? కొంచెమే. అప్పుడూ అప్పుడూ కొద్దో గొప్పో పంపిస్తూంటే సరిపోతుంది పాపం శివుడు చదువులేక ఉద్యోగం రాక బాధపడుతున్నాడు. మన మీమాత్రం చెయ్యందిస్తామంటే సంతోషిస్తాడు. నాన్న నిష్ఠూరాలూ ఆగుతాయి. పేరూ ఉంటుంది. నాకిలా అనిపిస్తోంది. ఏమంటావ్?" అన్నాడు. చాలాసేపు మౌనంగా ఉండిపోయింది కుసుమ. కుసుమ విషయంలో మౌనం అర్ధాంగీకారం కాదని తెలుసు భార్గవకి అనుకున్నట్టే పావుగంట తరువాత టీ.వీ. ఆపి తమలపాకుల పళ్ళెం టేబుల్ వెనక్కి నెట్టి భర్త దగ్గరగా వచ్చి కూర్చుంది కుసుమ చెప్పమన్నట్టుగా చూశాడు భార్గవ.

"చూడండి. ఏ బాధ్యత అయినా తల కెత్తుకోవాలనుకున్నప్పుడు దాని బరువుభారాలూ, దాన్ని మనం మోయగలమా అన్నదీ, దాన్నసలు నెత్తి కెత్తుకోవటంలో గల ఔచిత్యం ఏమిటీ అన్నదీ ముందే అంచనా వేసుకోటం మంచిది.

ఇప్పుడు కాస్త నిలవలో ఉంటున్నది కదా అన్న దిలాసాలో అయిదేళ్ళు డాక్టరీ చదివిస్తానంటూన్నారు మీ తమ్ముణ్ణి కానీ ఈ అయిదేళ్ళూ మన కింకే అవసరాలూ రావు అని కచ్చితంగా చెప్పగలరా మీరు? అలా వచ్చినప్పుడు అదీ ఇదీ కూడా నిభాయించుకోగలమా అని ఆలోచించారా మీరు?"

"నీది మరీ విపరీతం కుసుమా, అప్పుడప్పుడూ నాలగైదు వందలు వాడి చదువుకి పంపించటానికి మన నిలువలు కరిగిపోతాయేమోననీ, మనకి రోజులు గడవకపోతాయేమో అనీ ఆలోచించా లంటావేమిటి?" భార్గవ కంఠంలో విసుగుదల ధ్వనించింది.

"అక్కడే మీరు పొరపాటు పడుతున్నారు. మీరు అతికించుకోవా అనుకుంటున్న తంటనం అయిదారొందలతో ఒదిలేది కాదండీ. 'మీకు మీ నాన్న తత్వం తెలీదా? వేలువాపే నందిస్తే శరీరాన్నంత చేరవేయగల ఘటికుడాయన. చూస్తూండండి

మీ రిప్పుడు ఊ అన్నారంటే ఈ అయిదేళ్ళ భారమే కాదు ఆ తరవాత ప్రాక్టీసు గ్గూడా మీచేతే పెట్టుబడి పెట్టిస్తారు."

"నువ్వు భూతద్దంలోంచి చూస్తుంటావు కుసుమా!" మనసుకి ఎంత నొప్పి తోచినా అంతకంటే పైకి ప్రదర్శించటం చేతకాదు భార్గవకి.

"అవునండీ మీ రేమనుకున్నాసరే. నా వాళ్ళని గురించి కాక పైవాళ్ళమీద ఖర్చు చెయ్యాల్సివస్తే నా పద్ధతి అదే. నా ఉద్దేశం చెప్పమంటే ఊరికి ఉపకారం చేసేంత గొప్పవాళ్ళం కాదు. మన ఇల్లు మనం దిద్దుకుంటే చాలని." నిక్కచ్చిగా అన్నది కుసుమ.

"కుసుమా ! శివుడూ, నేనూ ఒక రక్తం పంచుకుపుట్టిన వాళ్ళం ఇల్లు మారినంత మాత్రాన ఊరి వాడంటూ అంతదూరం చేసన్తా మాట్లాడ్డం బావుండలేదు." నొచ్చుకున్నాడు భార్గవ. చలించలేదు కుసుమ.

"నే నొకటి చెబుతాను వినండి. నిజ మెప్పుడూ నిష్ఠురంగానే ఉంటుందని మా అమ్మ అనేది. మన మిద్దరం ఒకరి కొకరం ఏమీ కానప్పుడు మీ రక్తసంబంధీకులు మీ వాళ్ళు, నా రక్తసంబంధీకులు నావాళ్ళు, కానీ ఇప్పుడు మన రక్తం పంచుకుపుట్టిన వాళ్ళు మనవాళ్ళు, మిగతా వాళ్ళంతా మీ తమ్ముడవనీ, నా చెల్లెలవనీ బంధువులకిందే లెక్క ఆ బంధువర్గానికేకాదు పై వాళ్ళెవరికైనా నరే. సానుభూతికి మించి సాయం చేయాల్సివస్తే తనకు మాలిన ధర్మానికి పోవట్లేదు కదా మన మని తరిచి తరిచి చూసుకుని మరీదిగాలనేది నా మతం" అన్నది కుసుమ మొహమాటం లేకుండా.

"ను వ్వన్నట్టే అనుకున్నా ఇప్పుడు తనకుమాలిన ధర్మం ఏం చేస్తున్నాం? మనకి కావాల్సినవన్నీ అమర్చేసుకున్నాం కదా. అమ్మాయి పెళ్ళికి ఫిక్సెడ్‌లో వేశాం. అబ్బాయి చదువు కొలిక్కి వచ్చేసింది ఇప్పుడింకొకరికిచెయ్యందిస్తే మన కొంప మునిగేదేముంది చెప్పు?" ఎలాగైనా ఒప్పించాలనే ధోరణిలో అన్నాడు భార్గవ.

నొసలు చిట్లించింది కుసుమ "మీరు కావాలనే మరువు నటిస్తున్నారో లేకపోతే మీ తమ్ముడు డాక్టరవటం కంటే మరేమీ ముఖ్యం కాదనుకుంటున్నారో నాకు తెలీదా కానీ, చైతన్యకు విదేశాలకు వెళ్ళి చదువుకోవాలని ఉందని తెలీదు మీకు? వత్సకి పసుపు కుంకుం కింద ఏదైనా స్థిరాస్తి ఏర్పరచాలని కూడా వెనకొకసారి మనమనుకున్నాం. ఇప్పు డవేవి జ్ఞాపకం లేవనుకుంటా మీకు, సరే నాకు నా పిల్లల కోరికలకంటే మీ తుమ్ముడి చదువే ముఖ్యం అని మీ రనుకుంటే అడ్డంపడేదాన్నని మాత్రం అనుకోకండి. కానీ దానంత తెలివితక్కువతనం మరొకటి లేదని మాత్రం నేను కచ్చితంగా చెప్పగలను?" కుసుమ చెప్పాలిసిందింతే అన్నట్టు లేచిపోయింది.

అంతకన్నా ఎక్కువ బోధన భార్గవకి అవసరమూ లేదు ఘర్షణ పడ్డం, వ్యతిరేకించటం అతని తత్వానికే విరుద్ధం అతను ఎప్పటిలానే భార్య వాదన తప్పనిసరిగా బలవంతాన దిగమింగవలసిన చేదుమాత్రగా అంగీకరిస్తే.... తల్లి వెలిబుచ్చుతోన్న అమూల్యాభిప్రాయాన్ని కంఠోపాఠంగా ఉపదేశాలుగా తప్పకుండా అవలంబించాల్సిన పంథాగా, మహత్తరమైన జీవిత సత్యాలుగా స్వీకరించి మనసుకి ఇంకించుకున్నవాడు చైతన్య.

అత నా పక్కగదిలో పుస్తకం ముందేసుకు కూర్చున్నా తల్లితండ్రుల సంభాషణ మూలంగా చదువుతున్నది వంటపట్టక తల్లి చెబుతోన్న మాటల్నే భక్తిశ్రద్ధలతో వింటుండిపోయా డా రోజున.

● ● ● ● ●

పదేళ్ళు గిర్రున తిరిగి వచ్చాయి. చైతన్య తన ధ్యేయం నెరవేర్చుకున్నాడు. అత నిప్పుడు అమెరికలో గ్రీన్‌కార్డ్ హోల్డరు.

భార్గవ రిటైరై ఇంటిపట్టునే ఉంటున్నాడు. ఈమధ్య ఎప్పుడూ ఏదో నలత పీడుస్తూ ఉంటూంది అతన్ని.

ఆ రోజు జ్వరపడి లేచిన భర్తకి బత్తాయి రసం తీస్తోంది కుసుమ భార్గవ ఆమె పక్కనే పడకకుర్చీలో పడుకుని ఉన్నాడు. భార్య చెప్పే కబుర్లు వింటూ.

వీథిలో కౌముది ఆటో దిగుతోంది భారంగా.

"ఎవరా వచ్చింది?" అని అడుగుతోన్న భార్గవకి "కోడలు" అని బదులిస్తూ ఏమిటా ఉరమని పిడుగని ఆశ్చర్యపడుతూ లేచింది కుసుమ.

ఈ లోపల కౌముది రెండేళ్ళ కొడుకు బాబ్జీని కూడా దింపింది ఆటోకి డబ్బు ఇచ్చి పంపించింది.

ఒక చేత్తో కొడుకుని నడిపిస్తూ మరొక చేత్తో సూట్‌కేసు మోసుకొస్తున్న ఆమెకు ఎదురువెళ్ళి పెట్టందుకుంటూ. "ఇదేవి టమ్మాయ్? ఇక్కత్తైవే వస్తున్నప్పుడు ముందు ఇలా వస్తున్నట్టుగా కేబులన్నా ఇచ్చుకోరూ?" మందలింపుగా అన్నది కుసుమ గర్భిణీతో నిండుగా ఉన్న కోడల్ని పరీక్షగా చూస్తూ.

కౌముది మాట్లాడలేదు మౌనంగా కొడుకుని భార్గవకి అందించి బయట ఉండిపోయిన రెండో సూట్‌కేసుని కూడా లోపలికి చేర్చింది.

రసం గ్లాసు భర్త కందించి మిగతా నరంజామా గబగబా సర్దేస్తూ, "అదేమే మాట్లాడవు? ఈమాటు కాన్పుకి రావని

రాశావు కదా. హఠాత్తుగా ఎందుకు మనసు మార్చుకున్నావు?" కోడల్ని ఉద్దేశించి మళ్ళీ అడిగింది కుసుమ.

ఈసారీ జవా బీయలేదు సరికదా చేతుల్లో మొహం దాచుకుని ఏడ్వసాగింది కౌముది.

"అమ్మా, చైతన్య...."హడలిపోయి కలవరపడుతూ అడగబోయారు భార్గవ.

వెంటనే మొహంమీంచి చేతులు తీసి "ఆయనకేం నిక్షేపంలా ఉన్నారు." అన్నది కౌముది దుఃఖంతో ఎరుపెక్కిన కళ్ళు తళుక్కుమంటూ కోపాన్ని విరజిమ్మాయి.

ఆ మాటతో కుదుటపడి, కళ్ళు పెద్దవి చేసి మరేదో అడగబోతున్న భార్యని వారించాడు. "అంత ప్రయాణం చేసి వచ్చింది. తరవాత మాట్లాడవచ్చు కుసుమా అమ్మాయి స్నానం, పానం చూడు ముందు" అన్నాడు భార్గవ.

ఆ మాట గడిచింది. రాత్రి భాజనాలయాక బాబ్జీని నిద్రబుచ్చుతూ మధ్య మధ్య కమ్ముకుస్తోన్న దుఃఖోద్వేగాన్ని నంబాళించుకుంటూ చెప్పుకొచ్చింది కౌముది.

ఏడాది క్రితం చేస్తోన్న కంపెనీ మారాడట చైతన్య. అప్పట్నుంచీ అతనూ మారాడు. ఒక అమెరికా అమ్మాయి మోజులో పడ్డాడు. మొదటగా ఆ అమ్మాయితో స్నేహానికి ఆమెకంటే ఇతనే ఎక్కువగా వెంపర్లాడాడని కౌముది నమ్మకం. ఆ పరిచయం ముదిరింది. స్నేహాన్ని దాటి ప్రణయానికి దారితీసింది.

"ఒక బిడ్డ తండ్రయ్యారు మీ కీ పరస్త్రీ వ్యామోహమేమిటి? మిమ్మల్ని నమ్ముకుని ఇంత దూరం వచ్చాను నన్ను అన్యాయం చెయ్యకండి" అని కౌముది ఎంతో ప్రాధేయపడింది కళ్ళ నీళ్ళ పెట్టుకుంది.

"నా వ్యక్తిగత ఎఫైర్స్‌కి నువ్వు అడ్డం రానంతకాలం నీకే లోటూ రానివ్వను" అన్నాడు చైతన్య.

కాని దేశం. ఎవరితోనూ చెప్పుకోను గూడా వీల్లేని పరాయి వాతావరణం. ఏమీ చెయ్యలేని అశక్తత కౌముది తన దుఃఖాన్ని తానే దిగమింగింది.

తను గూడా చాటయితే ఇంకా దిగజారిపోతాడేమో, చెయిజారిపోతాడేమో అన్న భయంతోనే రెండో కాన్పుకి ఉండిపోదలచినట్టు ఇండియాకి ఉత్తరం రాసింది. కానీ కౌముది ఉండగానే ఆమె ఉనికినే మరిచి చైతన్య మితిమీరిపోయాడు. ఆమె కళ్ళెదురుగానే ఇద్దరూ కలిసి తాగటం, డాన్స్ అంటూ కిందా మీదా పట్టం, పిక్నిక్కంటూ వెళ్ళిపోయి రెండు, మూడు రోజులు ఇంటి చాయలకైనా రాకపోవటం సాగించారు.

ఇక కౌముది సహించలేకపోయింది.

"మందలించేవాళ్ళు లేరనే కదా మీరు తాళికట్టిన దాని ఎదురుగానే ఇంత విజృంభించి తెగబడుతున్నారు. ఇవ్వాళే మీ అమ్మా, నాన్నగార్కి మీ విషయమంతా తెలియపరుస్తాను. రమ్మని కేబులిస్తాను" అన్నది బెదిరింపుగా.

పెద్దవాళ్ళకి వెరుస్తాడని అనుకున్నది గానీ ఇది ఇంకా వికటిస్తుందనుకోలేదు కౌముది.

ఆ మర్నాడే చైతన్య బలవంతాన కౌముది చేత విడాకుల పత్రాలమీద సంతకం చేయించాడు.

"కేబులివ్వటం కాదు. స్వయంగా వెళ్ళి చెప్పుకో" అని చెప్పి ప్లే నెక్కించి పంపేశాడు ఇండియా.

"కడుపులో దాచుకునే తల్లిదండ్రులను ఎప్పుడో పోగొట్టుకున్నాను. వాళ్ళనుంచి సంక్రమించిన ఆస్తి కూడా మీ అబ్బాయిని నమ్మి ఆయనకే కైంకర్యం చేశాను."

ఒడిలో బిడ్డ నుంచుకు వెక్కి వెక్కి పడుతోన్న కౌముదిని చూస్తోంటే ఆమెపైన జాలితో గుండె కరిగి నీరవటమే కాదు. కొడుకు మీద ఆగ్రహం ఉప్పెనలా ముంచుకొచ్చింది కుసుమకి.

"వెళ్ళి చెప్పుకోమనేంత మొనగాడయినాడేం? చూస్తాను ఆ వలపుగత్తెతో తెగతెంపులు చేసుకొచ్చి మిమ్మల్ని తీసుకువెడతాడో, మాతో గూడా సంబంధం విడగొట్టుకుంటాడో, అన్నది కుసుమ ... కొడుకు ఎదురుగా ఉన్నట్టే కళ్ళురజేస్తూ.

* * * * *

"అమ్మా ! ఆరు పేజీల బరువైన నీ ఉత్తరం అందుకున్నాను. ముందు వాక్యంలోనే పూర్తిగా చదవమని గట్టిగా హెచ్చరించావు గానీ అనవసరంగా కాలాన్ని వ్యయం చేసేకునేటంత వ్యవధి నాకు లేనందుకు చింతిస్తున్నాను. అయినా అక్కడక్కడా చదివినా పూర్తి సారాంశాన్నే గ్రహించగలిగాను. ఏమున్న దందులో మూడొంతులు నన్ను చివాట్లేయటం మినహా?

"నే చేసిన అపరాధమేమి టసలు నీ కంత కోపం రావటానికి? బహుశా తనని పంపేశాననే ఉక్రోషంతో కౌముది మీకు ఏమి చెప్పిందో ఏమో.

నువ్వు రాసినట్టు తెల్లతోలు కనబడగానే వెర్రెత్తిపోయిన చంచలుణ్ణి కాదు నేను. తొందరపాటు నిర్ణయాలతో బ్రతుకుని చిందరవందర చేసుకునే అవివేకినీ కాను. నా ప్రతి చర్య వెనకా ఒక అర్థమూ, పరమార్థమూ చూసుకునే వ్యవహారదక్షత నాకుంది.

"ను వ్యూహిస్తున్నట్టు మార్గరెట్ వన్నెల విననక్కర కాదు. నన్ను తన వల్లో వేసుకోవాల్సిన కర్మలే దామెకి. ఆమె నా కంపెనీ అధిపతి ఏకైక కుమార్తె. ఆమె అనుగ్రహం ఉంటే మా సంస్థలో ఎన్నో ఉన్నత పదవుల్ని చేజిక్కించుకోవచ్చు. ఆమె కటాక్షవీక్షణం ప్రసరించినచోట ఐశ్వర్యం పంట పండించుకోవచ్చు. ఆ దేవతకి నేనంటే ఆకర్షణ ఏర్పడింది. నన్ను పెళ్ళాడటానికి గూడా సిద్ధపడింది. అది ఎంత అదృష్టమో కౌముది కేమి తెలుసు? నా పనికి అడ్డు రాకు అంటే వినలేదు. పంపేశాను.

"అమ్మా ! వేసినచోటే ఉండిపోవటం నా స్వభావానికే విరుద్ధం. పైకిపోయే సువర్ణావకాశం మార్గరెట్ రూపంలో నాకు లభించింది. రాచబాట ఎక్కేముందు అంతదాకా నడిచిన కాలిబాటని వదలటం తప్పనిసరి అది తప్పా? చేజిక్కిన గొప్ప అవకాశం వదులుకుని కౌముదీ. బాబ్జీ అంటూ కూర్చోమంటావా? ఆ చవటతనం నువ్వు నాకు నేర్పలేదు. నువ్వు నాకు నేర్పిందల్లా తనకుమాలిన ధర్మం కూడదన్న సత్యాన్నే.

"అమ్మా నీ కొకటి గుర్తు చేస్తాను. చిన్నప్పుడు నా చేతిలో తాయిలం ఉంది "బయటకు వెడితే స్నేహితులందరితో పంచుకోవాల్సి వస్తుంది. ఇక్కడే తినేసి వెళ్ళు" అనేదానివి. అప్పటినించే నా కోసమే నేను నా తరవాతే ఎవరైనా అనే భావం నాటుకున్నది పెద్దయ్యేకొద్దీ అది బలపడింది వేళ్ళూని స్థిరపడిందెప్పుడో. ఇప్పుడు నా భవిష్యత్తుకి ప్రతిబంధకమయ్యేట్టుంటే తల్లవనీ, పెళ్ళామవనీ, బిడ్డవనీ ఐ డోంట్ కేర్... తొలగించుకుని ముందుకే పోతాను.

"నీ మాట వినకపోతే నాకు తల్లి లేదనుకోమన్నావు. మంచిది. ఇక నాకు ఇండియా వచ్చే పని తప్పించావు గుడ్‌బై..చైతన్య".

నిశ్చేష్టురాలై నిలబడిపోయిందలాగే కుసుమ, బొమ్మలా నిలబడిపోయిన భార్యను నిర్లిప్తంగా చూశాడు. భార్గవ.

కాస్సేపటికి తెప్పరిల్లుకుని కళావిహీనమైన మొహంతో "చూశారా వాడేం రాశాడో !" అన్నది కుసుమ రుద్ధంగా.

"వాణ్ణి వేలెత్తి చూపే హక్కు మనకేమున్నది కుసుమా? తరతరానికీ మనమే పెంచుతున్న అంతరమిది మనమే కుచించుతున్న మమతల పరిధి ఇది మీ బామ్మ 'నీ' 'నా' అనే భేదం లేకుండా అందరూ నా వాళ్ళమనుకుంటూ ఆత్మీయత పంచిపెట్టింది. మీ అమ్మ దాన్ని తమ కుటుంబం వరకే పరిమితం' చేసింది. నువ్వు దాన్నింకా కుదించావు. నిన్నే ఆదర్శంగా తీసుకుని నీ కొడుకు 'చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష' అంటూ తనచుట్టూరా గీత గీసుకుని తన్ను తాను మాత్రమే ప్రేమించుకుంటున్నాడు.

"ఇప్పుడు చెప్పు కుసుమా ! నీ కొడుకుతో విడిపోయారు కాబట్టి ఒక వేలు ఎడమయ్యారని వీళ్ళని వాళ్ళ దారి వాళ్ళని చూసుకొమ్మందామా .. లేక వెనక్కి తిరిగి అనుబంధాలని అంగీకరిద్దామా?" కోడలి వంకా, మనవడి వంకా అర్థవంతంగా చూస్తూ అడిగాడు భార్గవ.

కన్నీళ్ళు తుడుచుకున్నది కుసుమ మనవడిని దగ్గరగా పొదువుకుంటూ తల వంచుకున్నది. ●